# సమిధలు

"మా ఇంటి కెళ్లిపోతానమ్మగారూ."

ఆ అభ్యర్థన వినబడనట్టు నటించాలని మూర గట్టిగా కలియబెట్టింది. పక్కస్టౌమీద కూత పెడుతున్న కుక్కరు దించివేసింది. స్టౌ మంటల్లాగానే టయిమయిపోతుందనే ఆదుర్దాతో మనస్సు ఎగిసిపడుతోంది అయాసంతో. ఒక్కోసారి పిచ్చెక్కుతుందేమో ఆ ఆదుర్దా భరించలేక అనిపిస్తుంది.

"అమ్మగారండీ !"

"ఏవిటే ?"

"మా ఇంటి కెల్తాను" వంటగది ఊడుస్తూ వేడికోలుగా చూసింది. మాణిక్యం. కళ్ళు మంకెనపూలులాగా ఉన్నాయి. ముక్కుపుటాలు అదురుతూ మాణిక్యం బాధని చూపిస్తున్నాయి. మళ్లీ దీనికేం తెగులొచ్చిందో అని మనస్సులో లక్ష తిట్లు తిట్టుకుంది సరళ. వెడతాను అని అందంటే ఇంకా రోజంతా అదే పాట, అదే ధ్యాస. ఈ పిల్ల ఈ పాట మొదలుపెట్టినపుడల్లా తన గుండెలు గుభేలుమంటుంటాయి.

టవలు, బట్టలు తీసుకుని బాత్‌రూంలోకి వెళ్ళబోతూ గట్టిగా అంది. "నీకేం చెప్పాను ? ఇంకో ఆర్నెల్లవరకూ నిన్ను పంపొద్దని మీవాళ్ళు ఉత్తరం

1980 చక్రపాణి ద్వితీయ అవార్డు పొందిన కథ

ప్రాణాలే. కావాలంటే చూపిస్తాను. నేనెప్పుడయినా శెలవులు వచ్చినపుడు మా అత్తగారి ఊరుగాని వెడితే నిన్నూ తీసికెడతాను. ఊరికే నసపెట్టకు" అంటూ ధడాల్న తలుపేసుకుంది.

గబగబా వంటిమీద నీళ్ళు దిమ్మరించుకుంటూ అమ్మయ్య ఇప్పటికెలాగో నోర్మూయించాను అని తేలిగ్గా ఊపిరి వదిలింది.

కడుపునిండా నిద్రపోవాలని, తనివితీరా స్నానం చేయాలని, కమ్మటి భోజనం తాపీగా, తృప్తిగా తినాలని ఎంతో కోరిక తనకి. ఈ మూడుటిక్ యాంత్రికమైన బ్రతుకులోమృగ్యమే. తొందర,తొందర. ఎంతో విలువైన, అమూల్యమైన బ్రతుకంతా ఈ తొందరలో హడావుడిలోపడి వికృతమైపోతోంది. మాణిక్యంలాంటి పసిపిల్ల చేతికింద ఉంటూ బాబుని చూడడం వలన ఇంత మాత్రమైనా నిభాయించుకొస్తోంది. పనిపిల్ల దొరకనంత కాలం పొద్దుటి అన్నీ తెముల్చుకోలేక నరకయాతనపడేది. బాబుని కేర్‌హోంలో వదిలి మళ్ళీ ఆఫీసు నుండి వచ్చేముందు తెచ్చుకుని మళ్ళీ ఇంటి పనిలో జొరబడి, అబ్బో ఆ రోజులు గుర్తుకొస్తే ఎలా లాగిందా బండి అని ఆశ్చర్యంగా ఉంటుంది. ఈ పిల్ల ఉండడం వలన తమకి ఆర్థికంగానూ అన్ని రకాలుగా కలిసివస్తోంది. ఇది కాస్తా ఉడాయిస్తే తనకి కుక్కచావే. ఈ పనికిమాలిన మహాపట్టణంలో పిల్లాడ్ని చూడడానికి ఏ ముండా దొరకదు.

బాత్‌రూం తలుపు తెరుచుకుని వచ్చేసరికి రాజు ప్రశ్నార్థకంగా చూస్తున్న చూపు, తడిసిన మాణిక్యం చెంపలా! ఏదో అడగబోయి భార్యవైపు చూశాడు. సరళ తీవ్రంగా మళ్ళీ చూసేసరికి తల వంచుకుని కంచంముందు కూర్చున్నాడు.

"అదేం అన్నంపూర్తిగా తినెయ్యి."

"వద్దు. టయింలేదు." హీల్స్ తొడుక్కుని మాణిక్యానికి రోజూ పాఠం వల్లించి ఆ పిల్ల అందించిన టిఫిన్‌బాక్స్ తీసుకుని బస్‌స్టాప్‌కి పరిగెత్తింది. అర్ధాకలితో లేచిపోయిన భార్యని నిస్సహాయంగా చూడ్డం మామూలైపోయింది. అలా సరళ పొట్ట చేత్తోపట్టుకుని పరిగెట్టడంలో తన అపరాధమేదో చాలా ఉందనిపిస్తుంది. కాని ఆర్థిక బాధ ఇంతకంటె భయంకరమైంది. దరిద్ర దేవత నమిలి మింగివేయడానికి కోరలు చాస్తూ తాండవం చేయడం తాను చూశాడు. అందుకే కొన్ని బాధ్యతలకోసం తమందరి భవిష్యత్ కోసం సరళ ఉద్యోగంచేయడం చాలా మంచిదనే అభిప్రాయంతో 'కనీసం సెలవుపెట్టి రెస్టుతీసికో సరళా, అనిగూడా అనలేని స్వార్థపరుడయిపోయాడు. రెండో చెల్లి పెళ్ళి తమని అప్పుల్లో ముంచింది. ఎంత అరిచినా, సాధించినా సరళకి స్వార్థం తక్కువకాబట్టి నీ వాళ్ళకెందుకు పెట్టాలి అని చిందులుతొక్కదు.

ఏమీ దాచుకోదు. కాని ఆమె పడే శ్రమ చూస్తుంటే ఇదేం బ్రతుకు అని విరక్తి కలుగుతోంది. కాని ఇంకో రకమైన పరిష్కారం ఎలా?

బాబుకి ముద్దిచ్చి సైకిల్ పెడల్‌మీద కాలేశాడు. అమాయకమైన తడికళ్ళు వీపుకి గుచ్చుకుంటున్నట్టుగా ఫీలవుతూ రివ్వుమని వెళ్ళిపోయాడు.

"వెళ్ళిపోయారేవిటి?" సత్యం పళ్ళు విరుచుకుంటూ మాణిక్యం దగ్గర కొచ్చాడు. చేతిలో సెక్సు నవల, బొమ్మల బనియన్.... ఆడవాళ్లందర్లో దేని కోసమో ఎప్పుడూ వెదుకుతున్న కళ్లతో సెక్సుపాఠాలు నేర్చుకుంటున్న విద్యార్థిలా అవుపిస్తాడు సత్యం.

"ఎందుకేడుస్తున్నావ్?"

"మా యమ్మమీద బెంగపుడతంది. మా ఇంటి కెల్లాలి." ఆ పిల్ల వాపుచ మంది. అయ్యయ్యో అంటూ గట్టిగా హత్తుకుని కళ్ళు తుడిచాడు. అతనొక్కడే తన గోడుని వినిపించుకునేవాడు అనిపించి మాణిక్యం వెక్కి వెక్కి పడింది. మళ్లీ దగ్గరకు లాక్కున్నాడు. ఏమేమో చేశాడు. ఆ పిల్లని ముద్దుపెట్టుకుంటున్న ప్పుడల్లా అతనికళ్లు ఎర్రబడుతుంటాయి. ఇంకేదో చేయాలనే ఆవేశం, కసీ కలుగు తుంటాయి. పిచ్చి పిచ్చి పనులన్నీ చేసి ఏదో రకంగా తన తృష్ణ చల్లార్చు కుంటూ ఉంటాడు పాతికేళ్ళు నిండినా ఉద్యోగం రాని కారణంగా పెళ్లికాని సత్యం.

చాలాసార్లు ఈ తంతు జరుగుతూనే ఉంటుంది. పదమూడేళ్ళు నిండబోతున్న మాణిక్యానికి ఏమీ అర్థమయ్యేదికాదు. తన తండ్రిలాగానో తాతలాగానో దగ్గరకు తీసుకుంటున్నాడ్లే అనిపించేది మొదట్లో. ఆ తర్వాత గట్టిగా వాటేసు కోవడం మొదలయ్యాక భయపడి సరళతో చెప్పింది. ఇంచుమించు తన వయస్సుకి దగ్గరగా ఇంతెత్తున భారీగా ఉన్న మరిదితో ఫ్రీగా మాటాడాలంటే బెరుకు, భయం ఆమెకు. ముఖావంగా మాట్లాడడం తప్పిస్తే చనువుగా ఏమీ అనలేదు. ఈ పిల్లని ఎంతో అన్వేషించి అత్తగారు పంపారు. ఇప్పుడు చాలా పనికి తనకు నిశ్చితంగా ఉంది. ఈ ఉపకులు పరుగులు ఎలాగూ తప్పవ్. బాబుని బాగా చూస్తోంది. ఇల్లంతా చక్కగా ఉంచుతుంది. ఈ యన్ని ప్రేమించి వర్ణాంతర వివాహం చేసు కోవడంవల్ల చాలా బాధ్యతలు నెత్తినేసు కోవాల్సి వచ్చింది. అవసరానికో, నిజంగా అభిమానంతోనో మరి అత్తగారి తరపున అందరూ తనని చాలా గౌరవిస్తారు. కాబట్టి తను వాళ్లతో ఏ గొడవ తెచ్చు కున్నా శ్రేయస్కరం కాదు.

"నేనుండనమ్మగారూ మా ఊరెల్లి పోతా."

"ఏం అటువంటిదానివి ఎందుకొచ్చా వసలు? వేషాలేస్తున్నావా? మీ ఊరు రెండొందల మైళ్ళ దూరం తెల్సా?"

తనతో వచ్చేటప్పుడు చాలా హుషారుగా బయల్దేరడం అందరితో నేను హైదరాబాద్ వెడుతున్నానని సంబరంగా చెప్పుకోవడం అన్నీ గుర్తున్నాయి సరళకి. అటువంటిదానివి, అసలెందుకు నాతో బయల్దేరావే అని ఉరిమింది.

మాణిక్యం ప్రాణానికిదో జైలు. ఇల్లు దాటితే కార్లు రిక్షాలు. ఈ గందరగోళం చూస్తే భయం వేస్తుంది. పక్క ఇళ్లల్లో అందరూ తలుపులు బిగించుకుంటారు. మాట్లాడరు. పగలంతా చంటిబాబుని పట్టుకోవాలి. మళ్ళీ పనంతా చేయాలి. ఆడుకోవడానికి, ఎవరితోనయినా జతకట్టడానికి వీల్లేదు. రాత్రిపూట వంటగదిలో నిద్ర. రోజూ తల్లి కలలోకివచ్చి ఏడ్చేది. తన ఊరు, నేస్తాలు,చింతచెట్లు, బోదెలు, తోటలు, స్వేచ్ఛగా తిరగడం ఇవన్నీ జ్ఞాపకం వచ్చి మరింత ఏడ్చేది. సరళ ఉరిమేసరికి కట్టలు తెంచుకున్న వాగులా ఏడుపు ఉధృతమయింది.

"ఎందుకే ఏడుస్తావ్? ఇక్కడేం తక్కువయింది. తినుండ్లేక."

"కాదమ్మగారూ, అయ్యగారి తమ్ముడ్ని సూత్తే బయింగా ఉంటుంది."

"ఏం చేశాడు?" అనుమానంగా చూసింది.

"గట్టిగా వాటేసుకుంటాడు. బుగ్గలు కొరుకుతాడు." సరళకి పూర్తిగా అర్థమయిపోయింది. అయినా తేరుకుని నవ్వేసింది. "అందంగా ఉంటావని ముద్దులే. చిన్నదానివిగా.... అందుకే...."

"కాదమ్మగారూ...." ఎలా చెప్పాలో ఆ పిల్లకి తెలియదు. తెలిసిన సరళకి అదో సమస్యగా అనిపించలేదు. ఈ పిల్లని పంపితే తనకి మళ్ళీ ఎవరూ దొరకరు అనే చేదు నిజం మనస్సుని అంకుశంలా పొడుస్తూ స్వార్థాన్ని ప్రేరేపిస్తుంది.

మధ్య మధ్యలో మానేసినా మాణిక్యం మారాంచేయడం మాన్లేదు. ఈ లోపు ఓ రెండు నెలలు గడిచిపోయాయి. నాలుగురోజుల కొకసారయినా మా ఇంటికెళ్లిపోతానని ఏడుస్తుంటుంది. సరళ వినిపించుకోవడం మానేసింది.

"పోనీ ఒకసారి తీసికెళ్ళి వాళ్ళని చూపిస్తే...." రాజు అన్నాడు. తనని మాణిక్యం రహస్యంగా రోజూ మధ్యాహ్నం బతిమలాడడంవల్ల.

"ఏం మిమ్మల్ని రాకాపడుతోందా పాకీముండ" సరళలో అసూయ బుసలు కొట్టింది. "అసలు నాకీ ఉద్యోగపు చెఱ లేకపోతే ఈతిప్పలన్నీ ఎందుకుంటాయి? ప్రేమించి పెళ్ళిచేసుకున్నందుకు చాలా మంచి పనిష్మెంట్ పొందుతున్నాను."

"నన్నేం చేయమంటావ్ సరళా. నా బాధ్యతల గురించి నీకు ముందే చెప్పాను. కాని నువ్వే నన్ను ప్రోత్స....!"

"అందుకే అందుకే నోర్మూసుకుని బాగా అనుభవిస్తున్నాను. కనీసం ఇంట్లో పనిపిల్లని మెయింటెయిన్ చేయడం గూడా అనవసరమనిపిస్తోందా! వాళ్ల ఊరు

వెళితే ఇది మళ్ళీ వెనక్కి వస్తుందా! ఆ తర్వాత నేనేగా సంగాలి ఇంటా బయటా బాగా చాకిరీ చేసిపెడుతుంటా వచ్చేవరకూ."

"ఇన్ని మాట లెందుకు పిల్లలు కొత్త పెద్దవాళ్ళయేవరకూ మనకీ బాధలు తప్పవు. నేను మాత్రం కావాలని నిన్ను బాధపెడుతున్నానా సరళా ?"

"అలా అయితే పనివాళ్ళ విషయంలో మీరు కల్పించుకోవద్దు. వీళ్ళని ఎంత వరకు ఉంచాలో నాకు బాగా తెల్సు. బాబుకి సంవత్సరం నిండేవరకూ దీన్ని పంపను."

భార్య ఇచ్చిన కఠినమైన తీర్పుకి బద్ధుడవక తప్పలేదు. అతనికీ చాలా జీవితం చాలా నిస్సారంగా అర్థవిహీనంగా ఉన్నట్టనిపిస్తుంది ఒక్కోసారి. జీవిత సమరంలో తామిద్దరూ నిర్దాక్షిణ్యంగా బలయిపోతున్నారనిపిస్తుంది. ఓ మాటా మంతీ లేదు. ముద్దూముచ్చట లేదు. ఇళ్ళు ఇల్లాలి చిరాకులలో సాధింపుతో ఎప్పుడూ వాతావరణం అఘోరకమైన విషాదపు గాలులతో ఉన్నట్టుగావుంటుంది అందుకే బయటకు పారిపోతాడు. సరళకి తాను అనుభవించలేనిదేదో మొగుడు అనుభవించేస్తున్నాడని దుగ్ధ, కసీ. అది ఆమె తప్పుకాదు. పరిస్థితుల బాధ్యతల సంకెళ్ల ఆమెలో కోమలత్వాన్ని పూర్తిగ చంపేసి ఒట్టి గయ్యాళి స్త్రీలా మార్చి వేశాయి.

ఈ రకమైన ఉదాసీనపు బ్రతుకులో ఓ చిన్న మార్పు మాణిక్యం పెద్ద మనిషి గావడం. సరళకి చాలా విచారం కలిగింది. పైగా అంత వెనకబడిన జాతిలోనుండి వచ్చినా ఈ పిల్ల ఒంటి రంగు, ఏపుగా పెరుగుతున్న ఒళ్ళు,తీరైన అవయవాలు సరళకి బాధకి కారణా లయ్యాయి. ఇక్కడ తిండి, నీళ్ళు బాగా వంటబట్టాయి ముండకు అనుకునేది. ఆ పిల్ల పట్ల ఇదివరకు ఉన్న జాలి పెద్ద మనిషి అయినాక క్రమేపీ తగ్గడం ప్రారంభించింది. ఏదో భయం తనకే అర్థంగాని సందేహాలు.

"అమ్మా సత్యం బాబుగారు చెయ్యి లాగారు. ముద్దు పెట్టుకున్నారు" ఫిర్యాదులు మామూలుగానే చేస్తుంది. సరళలో అసూయాగ్ని చల్లారుతూ ఎందుకో మనస్సు తృప్తిపడేది.

"సరదాగా లాగి ఉంటార్లే. ఇప్పుడే మయిందో." హఠాత్తుగా సరళకి జ్ఞానోదయం అయినట్టు అనిపించింది. సత్యం ఏంచేష్టలు చేస్తున్నా అభ్యంతరం కాదు గాని తన భర్త గూడా...సత్యం బుద్ధులేనా రాజుకి. మాణిక్యం అంటే చాలా ఇష్టం. లంచవర్లో మధ్యాహ్నం ఇంటికొస్తారు. ఈ ఆలోచనలు ప్రారంభమయి పెరిగి పిశాచల్లా మారి డాన్సు చేయడం ప్రారంభించాయి.

"ఏమే మధ్యాహ్నం పూట అయ్యగా రొక్కరే వస్తారా!"

"అప్పుడప్పుడెవరయినా వస్తారమ్మా అయ్యగారితోపాటు."

"ఆడవాళ్ళా మగాళ్ళా ?"

"ఒకావిడ కూడా వచ్చిందమ్మా. సక్కగా ఉంటుంది."

"నోర్ముయ్" సరళ విదిలింపుకి మాణిక్యం నోరు మూతబడింది.... అప్పటినుండి మనశ్శాంతిలేదు. ఓణీలు వేయించకపోయినా పొంగివస్తున్న దీని యవ్వనం ఎవరి కళ్ళబడకుండా ఎలా ఉంచడం ? అల్చిప్పల్లాంటి కళ్ళు, చిన్ని గడ్డం ఇది చాలా అందగత్తయిపోతోంది. సరళ తనని తాను అద్దంలో చూసుకుంటూ బాధపడేది. ఎందుకే కళ్ళనిండా అలా కాటుక పూసుకుంటావ్? మానెయ్యి అంది. అమ్మగారి విసుక్కి, కోపానికి అలవాటుపడిపోయింది. సరళ వెళ్ళిపోయాక తీరిగ్గా అలంకరించుకోవడం కాలక్షేపంగా తయారయ్యింది ఆ పిల్లకి.

ఇదివరలా సత్యం ముట్టుకుంటుంటే కోపం రావడంలేదు. ఏదో అర్థంగాని హాయి. అతను మెత్తగా నవ్వడం ముద్దు చేయడం ఇవన్నీ బెంగతో అలమటిస్తున్న హృదయానికి పన్నీటిజల్లులా ఉంటున్నాయి. ఇదివరకులా చిరాకు కలగడం లేదు.

మధ్యాహ్నం రెండు తరువాత సమయాన్ని సద్వినియోగంచేసుకుంటున్నారు.

ఓ రోజు బాగా ఏడుస్తున్న పిల్లని అడగాడు. మీ అమ్మమీద చాలా బెంగగా ఉందా ?

అవునన్నట్లు తలాడించి ఆశగా అతనివైపు చూసింది. చేతిలో బాబు నిద్రపోతున్నాడు. బుగ్గలమీద కన్నీళ్ళు జారిపోతున్నాయి.

తలుపులేసి వచ్చాడు. "మీ ఊరెళ్లాలంటే ఇరవై రెండు రూపాయలు ఛార్జి అవుతుంది."

"నువ్వు అప్పుడప్పుడూ ఇచ్చినియ్యి ఓ పదిదాకా ఉంటయ్యి" బెక్కుతూ అంది.

"వెరీగుడ్ దాచుకుంటున్నావన్నమాట. ఏం చేయను నాకేగాని సంపాదనుంటే ఈ క్షణాన నిన్ను మీ వాళ్ళ దగ్గరికి పంపి తిరిగి వెంటబెట్టుకొచ్చేవాడ్ని. అలా చేయాలంటే కనీసం వంద కావాలి."

"ఒక్కర్తే ఎళ్లాలంటే?"

"కనీసం వెళ్ళడానికి ఓ పాతిక."

"నా దగ్గర ఛారిజీలుంటే ఎల్లిపోతా."

గతుక్కుమన్నాడు. "అంత పని చెయ్యకు. ఒక్కదానివే బయల్దేరితే ఎవరయినా ఎత్తుకుపోతారు. నీ కిక్కడ బాగానే ఉందిగా నేను లేనూ."

అసంతృప్తిగా తల విదిలించింది. తమ ఊరు, ఇల్లు గుర్తుకొచ్చి దుఃఖం పెల్లుబుకింది. పెద్ద చెరువు, చెరువుగట్టు దగ్గర పెద్ద దిబ్బచుట్టూ ఈతపొదల మధ్యలో చుట్టిల్లు. రోజూ గేదెలమీద ఎక్కి ఆడేవాళ్ళు. చెరువులో స్నానం చేసేవారు. కోతలయ్యాక తట్టలు పట్టుకొని పరిగేరడానికి బయల్దేరేవాళ్ళు. సంక్రాంతివస్తే తెల్లారే బుట్టలు పట్టుకుని

సాయంత్రం ఐదున్నర వరకూ ఇల్లు విడిచి వుడడం— అందుగురించి ఆమె పడే మానసికమైన శారీరకమైన శ్రమ ఆమెని పీల్చేస్తున్నాయి. సత్యం బాత్ రూంలోంచి వచ్చి ముడి విప్పుకుంటున్న భార్యవైపు చూశాడు.

చాలా చిక్కిపోయింది. మొహంలో అలసట, చికాకు తప్ప చిరునవ్వు చాలా అరుదు. కనీసం నిద్రపోయే ముందు లాలించుదామన్నా కాస్సేపు అన్ని బాధలను మర్చిపోవడానికి శారీరకంగా దగ్గరవుదామన్నా.... ప్చ్. ఒంటిమీద చెయ్యి వెయ్యనివ్వదు. నాకు నీరసంగా ఉంవని పక్కకి తిరుగుతుంది. ప్రతి మాటికీ అదో రకంగా తన మొహంలోనికి చూస్తుంది. నువ్వుకదా కారకుడివి. నీ వల్లే నేనెన్నో పోగొట్టుకుని ఇలా ఉన్నాను అన్ని రకాలుగా.... ఇంకెన్నో అర్థాలు చెప్పే చూపది. చటుక్కున లేచి సిగరెట్ అంటించుకుని రోడ్డుమీదికి వెళ్లిపోతాడు. ఎన్నేళ్ల బ్రహ్మచర్యం అనిపిస్తుంది. కాని ఆమె కిష్టం లేకుండా ఆమెని ఎలా అనుభవిస్తాడు?

ఇద్దరికీ చాలా త్వరగా వృద్ధాప్యం వస్తుందిలాగయితే. నవ్వొచ్చిందతనికి. టీ తాగుతున్న భార్య దగ్గరకెళ్లి కూర్చున్నాడు.

"బాబుగాడు భలే ఆడుతున్నాడు సరళా."

"మీరుగూడా!"

చురుక్కుమంది. ఇంకేం మాట్లాడాలో తోచక సైకిల్ తీశాడు.

"బయటకెడుతున్నారా! అదృష్టవంతులు. అంత స్వేచ్ఛ నాకెక్కడిది?" రాజు మారుపలక్కుండా జారుకున్నాడు.

"ఏవే మాణిక్యం! మధ్యాహ్నం పూట అయ్యగారితోపాటు ఎవరైనా అమ్మాయిలు వస్తుంటారా? అంటే మళ్ళీ ఈ మధ్య వస్తున్నారా?"

"మొన్న ఒకామె వచ్చిందమ్మా. బాబుకి బిస్కత్తులు తెచ్చారు."

మొన్న కోఠీ సెంటర్లో ఈయన్తో మాటాడుతూ కనిపించింది అదే అయ్యుంటుంది. తను బస్సులో వస్తుంటే రెండు సార్లు తన కంటబడ్డారు. అసలేమయినా ఉందా కథ! అతన్నడగాలంటే వణుకు. ఇంత అల్పురాలివా అన్నట్టు చూసి మౌన యుద్ధం ప్రారంభిస్తారు. కోపం రాదసలు ఈ మనిషికి. వస్తే మనిషిని అసలు లెఖ్ఖ చెయ్యరు. ఎన్ని రోజులయినా మాటా పలుకూ లేకుండా మౌనంగా సాధిస్తారు. అందుకే భయం.

"ఈ సారెవరయినా వస్తే చెప్పు. ఏం మాట్లాడుతుందో చెప్పు." సరళ లోలోపల సిగ్గుపడుతూ అర్థింపుగా అంది.

స్వామి ఆజ్ఞను శిరసావహిస్తున్న భక్తుడిలా విధేయతగా తలాడించింది. సరళ కాస్సేపు బాబుతో ఆడి పాపని దగ్గర కూర్చోబెట్టుకుని హోంవర్క్ చేయించడం మొదలుపెట్టింది. ఎందుకు

చెట్టంత మగాళ్ళిద్దరున్నారు ఊరెంబడి బలాదూరుగా తిరగడమే అనుకుంటూ పాపకి పాఠాలు చెప్పడంలో మునిగి పోయింది.

* * *

సత్యానికి బాంక్‌లో ఉద్యోగం రావడం జాయినవడం జరిగిపోయింది. విజయవాడ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో వచ్చింది. మాట మాత్రమయినా చెప్ప కుండా వెళ్ళిపోయాడని విలవిలలాడింది మాణిక్యం. అసలు ఆ సమయంలో ఆమె ఉనికినే మర్చిపోయి అన్నావదినల్తో ఉత్సాహంగా కబుర్లు చెప్పుకుంటూ అవీ ఇవీ సర్దుకున్నాడు.

"వదినా నా మొదటి జీతం నీకే. నీ చలవ వలనే ఇంత మాత్రమయినా...." గొంతుకేక్కడో అడ్డుపడినట్లయి ఆగి పోయాడు.

సరళకి చాలా సంతోషంగా అనిపిం చింది. కొసరి కొసరి వడ్డించింది. ఎన్నో జాగ్రత్తలు చెప్పి ఆనందంగా బస్సె క్కించారు దంపతులు. ఎలాగైనా సరళ చాలా మంచిది అనుకున్నాడు రాజు తిరిగి వస్తూ. రిక్షాలో తన భుజంచుట్టూ ఉన్న రాజు చేతిస్పర్శకి ఇంకేవో అనుమానాలు వస్తున్నాయి. సత్యం వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం మాణిక్యం ఒక్కతే.

అందరూ బస్‌స్టాండుకి వెళ్ళిపోయాక గావురుమని ఏడ్చింది మాణిక్యం. మొన్నటి వరకూ తల్లి బెంగ. సత్యం మాటలతో, చేష్టలతో చాలా మరిపించాడు. అందుకే ఈ మధ్య ఆ దిగులు మర్చిపోయి సరదాగా నవ్వుతూ తుళ్ళుతూ తిరుగు తోంది. ఏమీ మాట్లాడకుండా వెళ్ళొస్తాను మాణిక్యం అని వెళ్ళిపోయాడు. వార్డికి డబ్బాలిస్తాను అన్నాడు. బస్సెక్కేస్తా నన్నాడు.

వాగ్దానాలన్నీ జ్ఞప్తికొచ్చి చాలా ఏడ్చింది. సరళ బస్‌స్టాండునుండి వచ్చాక కారణం గ్రహించగలిగింది. కాని తనలో మొదలయిన బాధ ముందు ఈ పిల్లపడే బాధ చాలా అల్పంగా అనిపించింది.

మధ్యాహ్నం ఎవరూ రావడంలేదని మాణిక్యంతో పదే పదే జవాబు ఇప్పించు కున్నాక కాస్త తేలికపడింది సరళ మనస్సు. రోజూ ఆఫీసుకి వెడుతోంది వస్తోంది. సత్యం లేనిలోటు మినహాయిస్తే ఇంకేమార్పూ లేదు ఇంట్లో. అప్పుడే అతను వెళ్ళి వారం దాటింది.

ఆ రోజు తుఫాను. పేదవాడి కన్నీరులా నెమ్మదిగా కురుస్తూ మధ్య మధ్య పెనుగాలులతో విజృంభిస్తోంది. శెలవుపెట్టబోయి ఆ రోజు ఇన్‌స్పెక్షన్ అని జ్ఞాపకంవచ్చి ఆటోలో ఆఫీసుకి వెళ్ళిపోయింది. మధ్యాహ్నం స్కూలుకి శెలవు ఇవ్వడంతో రాజు తడుస్తూ వచ్చాడు. పక్కనే డ్రిల్లు టీచరు రజని ఉంది. తలుపు తెరిచిన మాణిక్యాన్ని చూసి 'మీ అమ్మమీద బెంగ తగ్గిందా' అని నవ్వింది

బిక్కు-బిక్కుమంటూ కూర్చున్న మాణిక్యానికి వీళ్ళిద్దరి రాక సంతోషం కలిగించింది.

"అయ్యగారూ టీతేనా" అంటూ రెండు కప్పుల్లో పోసుకొచ్చింది.

"సమయస్ఫూర్తి ఎక్కువ ఈ పిల్లకి" మెచ్చుకోలుగా చూసింది రజని.

గాలికి టపటపా కొట్టుకుంటున్నాయి తలుపులు, కిటికీలు. అన్నీ బిగించి వచ్చాడు. "మీ ఇంటికి ఇంత వర్షంలో బయల్దేరితే అసలే సన్నగా ఉన్నావు గాలికి కొట్టుకుపోయేదానివి" కొంటెగా నవ్వాడు.

ట్యూబులైటు కాంతిలో తడిసిన కురులు అక్కడక్కడా అంటుకుని కడిగిన ముత్యంలా అతి నిర్మలంగా కనిపిస్తోంది రజని. రజనిని చూస్తున్నప్పుడల్లా మనస్సు వశం తప్పుతూ ఉంటుంది అతనికి. మొదట్లో ఆమె చొరవ చూసి చికాకు కలిగి బింకంగా ఉండాలని ప్రయత్నించాడుగాని సెలఏటి లాంటి ఆమె మాటల ఉరవడిలో అతని గాంభీర్యం పటాపంచలయింది.

"చాలా బావున్నావు" ఇంగ్లీషులో అన్నాడు.

చెంపలు ఎర్రబడ్డాయి. "ఇలా మాట్లాడితే నేను రాను బాబూ."

"ఎవరూ లేర్లే. మా తమ్ముడు విజయవాడ వెళ్ళిపోయాడు."

"అయితే?"

రాజు తలెత్తి చూశాడు. ఎదురుగా గుమ్మానికి చేరగిలబడి వీళ్ళిద్దరి సంభాషణ ఆసక్తిగా వింటోంది మాణిక్యం. ఆ పిల్లకి ఈ సరసోక్తులు పూర్తిగా అర్థంగావుగాని వాళ్ళిద్దరూ ఉంటే చాలా సందడిగా అనిపిస్తుంది. మాణిక్యాన్ని చూస్తూ "వెళ్ళి పడుకోమ్మా. బాబు మంచం పక్కన చాపవేసుకో. నేను లేపుతాలే నాలుగింటికి" అన్నాడు మృదువుగా. అలాగే అంటూ అయిష్టంగానే కదిలింది.

సిగరెట్ అంటించుకుని కుర్చీకి జారగిలబడ్డాడు. అతని కళ్ళు ఆమెని నిలువెల్లా పరిశీలిస్తున్నాయి. చలికి నరాలు జివ్వుమంటున్నాయి. ఆమెని కన్నార్పకుండా చూస్తూ వరసగా సిగరెట్లు కాల్చాడు.

ఏమీ మాట్లాడదు. బోర్ కొడుతోంది.

లేచి దగ్గరగా వచ్చాడు. బలిష్ఠమైన చేతులు ఆమె చుట్టూ బిగుసుకున్నాయి.

"ఏమిటి రాజూ" కోపం నటించబోయింది.

"ప్లీజ్ కాదనకు రజనీ. జీవితంలో కావాల్సినవన్నీ పొందినా అనుభవించలేని నిర్భాగ్యుడ్ని. నీకు దూరంగా ఉండాలని చాలా ప్రయత్నించాగాని పాదరసంలా నన్ను చేరావు. నీకు మాత్రం తెలియదా నేను పెళ్ళయినవాడ్ని ఇద్దరు పిల్లల తండ్రినని. అయినా నేను నీకు కావాలి.

"నీ చుట్టూ ముళ్ళకంపల్లాంటి బాధ్యతలకోసం పెళ్ళి వాయిదావేస్తూ

కోరికల్ని అణచుకోలేక ఈ సంఘర్షణలో నలిగిపోతున్నావ్. కమాన్ ఆ గదిలోకి వెడదాం పద. నీకు ఏమీ అవదు. జాగ్రత్తలు తెల్సు నాకు" కోరికతో ఇది తప్పు అని మనస్సు పెడుతున్న ఘోషతో అతని కంఠం వణికింది.

రజని కాస్సేపు ఆలోచించింది. లోక విరుద్ధం అని తెలిసినా తను పొందబోయేది చాలా తాత్కాలికమైనదే అని తెలిసినా రాజుమీద ఆకర్షణ చంపుకోలేకపోయింది. ఏమీ తెలియనట్టు నటిస్తూనే వీలయితే అతని కౌగలిలో నలిగిపోవాలనే ఈ తుఫానులో అతనితోపాటు వచ్చింది.

"ఎందుకాలోచన? నేనంటే ఇష్టం లేదా."

"చాలా ఇష్టం. ఆకాశమంత. కాని ఏ హక్కూ లేదు నాకు."

"ప్రస్తుతం నా మీద పూర్తిగా హక్కు ఉంది" అల్లరిగా నవ్వాడు.

ఇంక నిగ్రహించుకోలేక అతని తల వంచి ముద్దు పెట్టుకుంది. ఇంతకాలానికి అతనికి దగ్గరయినందుకు ఉద్వేగంతో కళ్ళు చెమ్మగిల్లాయి. రాజుకి పొరపాటు అనే హెచ్చరిక అంతరాంతరాల్లో మారుమ్రోగుతోంది. కాని శరీరం మాటవినదు. అనుభవాన్ని నిజంగా శరీరం కోరుతున్న

ప్పుడు మనస్సు చేసే హెచ్చరికలు ఎగిరి పోతాయి. ఆమెని నడిపించుకుని బెడ్ రూంలోకి తీసుకుపోయాడు.

జరిగిందేమిటో తెలుసుకున్నాక విపరీతంగా సిగ్గుపడ్డాడు రాజు.

"నీ భార్యకి అన్యాయం జరిగిందని బాధా?" వెటకారంగా అంది.

"ఆమెని ఈ హైద్రాబాద్‌లో ఉద్యోగం చేయించడం ద్వారా ఎలాగూ అన్యాయం చేసుకున్నాను మా దాంపత్యానికి."

"ఎలాగైనా నీ శ్రద్ధ నీ సంసారం గురించే. నేను బలహీనురాల్ని."

రాజుకి చాలా జాలనిపించింది. దగ్గరకు లాక్కున్నాడు. ముంగురులు సవరించాడు. "క్షమించు రజనీ. అందరికంటే త్యాగ మూర్తివి నువ్వు. నిన్ను పెళ్ళి చేసుకోబోయేవాడు అదృష్టవంతుడు. ఎంతో చక్కటి అనుభూతి నిస్తావు. మైమరపిస్తావు."

"నాకు పెళ్ళా! ఈ జన్మకి ఆ అదృష్టం లేదులే. ఇదిగో ఇలాగే...." రజని ఏడవబోయి పెదిమలు కొరుక్కుంటూ కంట్రోల్ చేసుకుంది.

"చాలా టయిమయినట్టుంది పద. మీ ఇంటిదాకా తోడు వస్తాను" ఆమెని లేపి గడియ తీశాడు. వేగంగా పారిపోతున్న మాణిక్యాన్ని చూసి అదిరిపోయాడు. రజని చెప్పులు తొడుక్కుని "పద" అంది.

ఎంత పొరపాటు. ఇప్పుడిప్పుడే యవ్వనం వికసిస్తున్న ఈ మొగ్గని పూర్తిగా అలక్ష్యం చేశాడు. తనేంచేశాడో ఈ పిచ్చి పిల్లకి అర్థమయిపోయే ఉంటుంది. సరళతో చెబితే ఆమె కసలే ఆవేశం ఎక్కువ. వెంటనే ఏ అఘాయిత్యమైనా తలపెట్టినా ఆశ్చర్యంలేదు.

అన్యమనస్కంగా రజనితోపాటు బయల్దేరాడు. ఆమెని దిగబెట్టి ఆటోలో వచ్చేశాడు. ఐదుంబావు అవొస్తోంది. సరళ వచ్చినా రావచ్చు. ఇంటికొచ్చాక మాణిక్యం తనని పదేపదే పరిశీలిస్తున్నట్టు ఇబ్బందిగా ఫీలయ్యాడు. ఓ చిన్నపిల్ల ముందు తలదించుకోవాల్సి వచ్చింది. తన నిగ్రహం ఎటుపోయింది? ఇంత అవివేకంగా ఎలా ప్రవర్తించాడు?

మాణిక్యం డబ్బులు లెక్కబెట్టుకుంటోంది. "ఎక్కడివా డబ్బులు మాణిక్యం" అన్నాడు.

ఆ పిల్ల మొహం మతాబులా వెలిగింది. "సత్తెంబాబుగా రిచ్చారు...."

"అహ"

"మా ఊరెల్లటానికి చారిజీ డబ్బులిత్తానన్నారు. ఇంక ఆరు తగ్గాయి."

రాజు గుండెల్లో కలుక్కుమంది. మాణిక్యం వచ్చి అర్నెల్లయినా ఇంకా వాళ్ళూరు వెళ్ళాలనే ధ్యాసలోనే ఉంది. ఏమీ మాట్లాడకుండా పేపరు చదవడానికి తెరిచాడు.

"అయ్యగారూ!"

"ఆ."

"మీరిస్తారా?"

"చూద్దాం."

"ఊరికే వద్దు."

"సరి" నవ్వాడు.

"ఇందాక మీరు ఆయమ్మ గారికి—డబ్బులిచ్చారా?" అమాయకంగా చూసింది.

అతనికి సర్వం అర్థమయిపోయింది. ఎంత దారుణం. ఆ వెధవ సెక్స్ పుస్తకాలు చదువుతారని తెల్సు. అయినా ఆ వయస్సు అటువంటిదని మందలించలేదు. కాని వాడి కిరాతక చర్యలకి ఈ పిల్ల.... తను చేసింది మాత్రం ఏమిటి? వయస్సు తేడా ఒక్కటే.... రాజు కణతలు అదిరి పోతున్నాయి.

"అయ్యగారూ నేను గూడా మీదగ్గర పడుకుంటాను."

"మాణిక్యం నోర్మూయ్." పూనకం వచ్చినవాడిలా అరిచాడు. మాణిక్యం హడలిపోయి ఏడవడం ప్రారంభించింది. తనని తాను అదుపులోకి తెచ్చుకుంటూ మెల్లగా ఆ పిల్ల ద్వారా అసలు విషయాన్ని రాబట్టాడు. దిమ్మ తిరిగినట్లయింది. తామందరి అవసరాలకి సమిధిలా ఆహుతి అయింది. సరళకి ఏదో వంకబెట్టి నచ్చ జెప్పి స్త్రీ పురుష సంబంధం వీటి గురించి ఏమీ తెలియని కేవలం పదమూడు ఏళ్ళు నిన్నగాక మొన్న పుష్పవతిఅయిన పిల్ల తప్పుడు దారిలో పడింది. కాని ఇంకో పిల్లని వెదికాక ఈ పిల్లని పంపేయాలి.

"మాణిక్యం. నిన్ను మీ ఊరు పంపేస్తాను కాని నువ్వు ఏమీ మాట్లాడకు. ఈ రోజు రజని వచ్చిందని అమ్మగారితో చెప్పకు. నిజంగా మీ ఊరు పంపిస్తా నిన్ను."

ధన్ ధన్ మని తలుపు చప్పుడయింది.

రాజు వీధి తలుపు తీశాడు. సరళ అనుమానంగా చూస్తూ లోపలికొచ్చింది. "మధ్యాహ్నమే ఇంటికొచ్చేశారట. మీ స్కూల్లో ప్యూన్ చెప్పాడు. ఫోన్ చేశాను. మా ఆఫీసు కొస్తారేమో నన్ను తీసుకు రావడానికని."

"సారీ సరళా! శెలవిచ్చేశారు. వర్షం తగ్గిందేమో కదూ" ఆమె మాటాడే అవకాశం ఇవ్వకుండా గబగబా బయిట కెళ్ళిపోయాడు. ఎందుకో తనని చూడగానే తప్పించుకు పారిపోయాడని పించింది. తలుపులన్నీ వేసి ఉన్నాయి. ఎప్పుడలా కాస్సేపు అనుమానాలతో బాధపడి తనని తాను మందలించుకుని మాణిక్యం ఇచ్చిన టీ అందుకుంది. గుర్రంలా ఎదిగిపోతోంది అనుకుంది ఈర్ష్యగా.

"ఏమే బాబు ఇంకా నిద్రపోతు న్నాడా?"

"అవునమ్మా."

"పనంతా అయిపోయిందిగా!"

"అయిపోయిందమ్మా. అన్నంగూడా వండేశాను."

"అయితే కాసేపు పడుకుంటాను. అయ్యగారొస్తే వెళ్ళి పాపని తీసుకు రమ్మనమని చెప్పు. ఆ స్కూలు రిక్షా అబ్బాయి ఈ రోజు రాలేదట. ఈ తుఫానులో అనవసరంగా పంపాను." చీర మార్చుకుని బెడ్‌మీద వాలబోయింది. పక్కమీద పగిలిన గాజులు, మంచం అవతల ఎర్ర రిబ్బను. అది దీనిదే. పగిలిన పక్క. గాజులు దీనివే. తల గిర్రుమని తిరిగిపోతూ ఉంటే "ఒసేయ్" అని కేకబెట్టింది.

పరుగు పరుగున వచ్చింది. "ఈ పక్కమీద ఎవరు పడుకున్నారే? ఈ ఎర్ర గాజులు నీవేగా?" సరళ రాక్షసిలా అరిచింది.

మాణిక్యానికి ముచ్చెమటలుపోశాయి. అవీ ఎర్రగాజులే. పొద్దున ఏ పాపో పడేసి ఉంటుంది. రిబ్బను సరళ చేతిలో పాములా కనిపిస్తోంది.

"చెప్పు ముండా ఈ పగిలిన గాజులూ ఈ రిబ్బనూ నీదే కదూ?" ఆమె అరుపు ఇల్లంతా ప్రతిధ్వనించింది.

అయ్యగారొస్తే బాగుండు. ఏం చెప్పాలో తెలియటంలేదు. అక్కడ్నించి వెళ్ళబోయింది.

"ఆగు వెళ్ళకు." పులిలా గర్జించింది. "చెప్పు ఈ పక్కమీద గాజులు నీవే కదూ?"

అవునని ఒప్పుకుంటే ఆమె అప్పటికి వదిలిపెడుతుందా అనిపించింది ఎందుకో ఆ పిల్లకి.

ఇంతలో కరెంటు పోయింది. తలుపులన్నీ వేసి ఉండడంవల్ల చిమ్మచీకటిగా ఉంది.

ఆ చీకటిలో ధైర్యంగా మాణిక్యం గొంతు పెగుల్చుకుంది.

'రజనమ్మగారు వచ్చినట్టు తెల్సిపోయిందా! అనుకుంది కాసేపు. ఉహూ కాదు గాజులు పగలగొట్టుకున్నానని కోపం వచ్చిందేమో ఇల్లంతా గత్తరగా ఉందాయె' అనుకుంటూ అంది.

"నాయేనమ్మా."

ఎదురుగా అలమరాలో మెరుస్తున్న పేపరు వెయిట్ సరళ చేతుల్లోకి వచ్చి విసురుగా మాణిక్యం కణతల్ని తాకింది.

"అమ్మో" కుప్పలా కూలిపోయింది మాణిక్యం.

"కుక్క తిన్నఇంటి వాసాలు లెక్కబెట్టావే. భగవంతుడా నే ననుకున్నంత పనీ జరిగింది. దీనికి అలవాటుపడిపోయారాయన. ఏకులా వచ్చి మేకులా మారిపోయావు గదే." సరళ బిగ్గరగా తిడుతూ ఏడవడం ప్రారంభించింది. ఏడ్చి ఏడ్చి తేరుకుని లేచింది. లైట్లు వెలిగాయి. మాణిక్యం అలాగే వుంది. లేవలేదు. నిర్ఘాంతపోయింది. అమ్మా అంటూ రాజుతో పాటు లోపలికి వచ్చిన పాప తల్లి చీరలో మొహం దాచుకుంది.

ఏమిటీ మాణిక్యం నిద్రపోయిందా ! అంది ఆశ్చర్యంగా

రాజు తలతిప్పి చూశాడు. ఈ లోపల మోకాళ్ళ మీద వంగి మాణిక్యాన్ని లేవ దీయబోయిన సరళ ఆర్తనాదం చేసింది.

"ఏమయింది. ఏమయింది సరళా ?" రాజు గాభరగా వంగాడు. నిర్జీవంగా తల వేలాడేస్తున్న మాణిక్యం తనలో ప్రాణాలెప్పుడో ఎగిరిపోయాయని వెళ్ళడబడుతోంది

"ఏమయింది ? ఏం చేశావు ?" కంపించిపోతూ అరిచాడు.

"గాజులు గాజుల పక్క మీద గాజు" సరళ స్పృహతప్పి పోతోంది.

"ఎంత పని చేశావు సరళా ?" ఆమెని వళ్ళోకి తీసుకుంటూ మాణిక్యం వైపు చూస్తూ కుమిలి కుమిలి ఏడవడం ప్రారంభించాడు మాణిక్యం ఏ జబ్బుతో చచ్చిపోయిందని చెప్పాలి ? అని అతని మస్తిష్కంలో ఎన్నో పరిష్కారాలు ప్రశ్నలు తిరగడం ప్రారంభించాయి.